## సీఎంవో ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● ఏపీ సేవా సర్వీసులను క్లియర్ చేయండి
● కలెక్టర్ రాజకుమారి ● పీజీఆర్ఎస్‌కు 211 వినతులు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించి సరియైన ఎండార్స్‌మెంట్ ఇవ్వడం లేదని 72 గంటలకు మించి ఒక్క గ్రీవెన్స్ కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. ఏపీ సేవా సర్వీసులకు సంబంధించి 1337 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులైన ప్రత్యేక అవసరాలు గల ఐదుగురు బదిరులకు టచ్‌స్క్రీన్ ఫోన్‌లను, ఒకరికి ల్యాప్‌టాప్‌ను కలెక్టర్, జేసీ అందజేశారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 211 మంది బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతులను సమర్పించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

### జనవరి 15లోగా పనులు పూర్తి చేయాలి

పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాలలో జిల్లా వ్యాప్తంగా శంకుస్థాపన చేసిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైన్లకు సంబంధించిన 1026 పనులను వచ్చే ఏడాది జనవరి 15లోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ వేదికలో భాగంగా సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు, పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలు, స్వేప్, ఈ ఆఫీస్, రెవెన్యూ సదస్సులు, 200 వందల రోజుల కార్యాచరణ ప్రణాళిక, కోర్టు కేసులకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీశైలానికి భారీగా ఇన్‌ఫ్లో

● ఐదు గేట్లు ఎత్తివేత ● ఇన్‌ఫ్లో 1,64,963, ఔట్‌ఫ్లో 2,04,973 క్యూసెక్కులు



శ్రీశైలం, అక్టోబరు 21: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద భారీగా కొనసాగుతోంది. దాంతో సోమవారం డ్యాం అధికారులు ఐదు క్రస్టుగేట్లు పది అడుగులమేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,17,539 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 51,324 క్యూసెక్కులు మొత్తం 1,68,863 వరద నీరు వస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమాయానికి జలాశయానికి 1,64,963 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తిస్థాయి నీటిమట్టం 884.30 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 211.4759 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,888 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. జలాశయం ఐదు క్రస్టుగేట్ల ద్వారా 1,38,770 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.



రోడ్డుపై బైఠాయించిన పొదుపు మహిళలు

### మద్యం దుకాణం ఏర్పాటుపై
## మహిళల ఆందోళన

గడివేముల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పొదుపులక్ష్మి కార్యాలయ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎల్లమ్మ ఆధ్వర్యంలో సోమవారం పొదుపు మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు పొదుపు సంఘం కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు సంఘం కార్యాలయానికి నిత్యం మహిళలు వస్తుంటారని అన్నారు. కార్యాలయ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మందుబాబులు పొదుపు సంఘం కార్యాలయం ప్రాంగణంలోనే మద్యం తాగి ఖాళీ సీసాలను విచ్చలవిడిగా పారేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఇది ఇలానే కొనసాగితే మందుబాబుల ఆగడాలకు హద్దు లేకుండా పోతుందన్నారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వెంకట రమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు వడ్డు లక్ష్మీదేవి, సుభద్రమ్మ, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## పోలీస్ సేవలు మరువలేం

పోలీస్ అమరవీరుల సంస్మరణ సభలో కలెక్టర్, ఎస్పీ



లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సేవలు మరువలేమని కలెక్టర్ రాజకుమారి గనియా అన్నారు. సోమవారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ అమరవీరుల సంస్మరణార్థం ఏర్పాటు చేసిన స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ముందుగా పరేడ్ కమాండర్ నాగభూషణం వద్ద నుంచి కలెక్టర్, ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వారి వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విచ్చేసిన పోలీస్ కుటుంబాల సభ్యులు, పోలీస్ సిబ్బందికి నమస్కరించి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు నంద్యాల జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరఫున అండగా ఉంటామని కలెక్టర్ భరోసా కల్పించారు. అనంతరం ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగనిరతిని స్మరించుకునేందుకు ఏటా అక్టోబరు 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినంగా పరిగణిస్తున్నామన్నారు. పోలీస్ సిబ్బంది ఐక్యతకోసం శిక్షణ, క్రీడా పోటీలు తదితర వాటిని కూడా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరస్పర సహకారంతోనే ఇరుదేశాల బంధం బలోపేతం

మెల్‌బోర్న్ విక్టోరియన్ పార్లమెంట్‌లో ఎంపీ శబరి ప్రసంగం



ప్రసంగిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భారత్, ఆస్ట్రేలియా బంధం బలోపేతం కోసం ఇరుదేశాలు ముందుండాలని, పరస్పర సహకారంతోనే ఇది సాధ్యమని నంద్యాల ఎంపీ, లోక్‌సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న మెల్‌బోర్న్ విక్టోరియన్ పార్లమెంట్‌ను ఉద్దేశించి సోమవారం ఆమె ప్రసగించారు. మానవత్వం, సేవాగుణంలో భారత్ ముందుండడంతోపాటు అగ్రరాజ్యాలకు దీటుగా ఆర్థికంగా ఎదగడం అభినందనీయమన్నారు. ప్రపంచ దేశాలతో భారత్ స్నేహంగా మెలుగుతోందని తెలిపారు. ఎగుమతులు, దిగుమతులు చేసుకోవడం వల్ల ఆస్ట్రేలియా, భారత్ ఆర్థికంగా అబివృద్ధి చెందుతున్నాయన్నారు. భారత్, ఆస్ట్రేలియా తీసుకోవాల్సిన అంశాలలో సాంకేతిక, శాస్త్రీయ, శక్తి నైపుణ్యాలను జోడించినపుడే భవిష్యత్తు మానవాళికి ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలోని భారత్ సంతతికి చెందిన వైద్యులను ప్రోత్సహించేందుకు ఇలాంటి నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. స్వతహాగా ఇంటర్వెన్షన్ రేడియాలజిస్ట్‌గా తనను ఆస్ట్రేలియా మెల్‌బోర్న్ విక్టోరియన్ పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిం చేందుకు అవకాశం కలించడం ఆనందంగా ఉందన్నారు. ఆ దేశ ప్రధానికి, అలాగే భారత్ ప్రతినిధిగా ఇక్కడకు పంపిన ప్రధాని నరేంద్ర మోదీకి, సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


చరిత్రను చాటుతున్న
### కేతవరం గుహలు
• ఇప్పటికీ కొండల్లో దర్శనమిస్తున్న నాటి చిత్రకళా వైభవం 6

టోల్ ఫ్రీ నెంబర్లపై
### అవగాహన ఉండాలి
• ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా 7

కర్నూలు మెడికల్
### కళాశాలలో ర్యాగింగ్
• జూనియర్లను వేధిస్తున్న సీనియర్లు 6


రుద్రవరంలోని పాత ఆరోగ్యకేంద్రం భవనంపై చెట్లు ఇలా

## భవనం ఎక్కిన చెట్లు

రుద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం గోడలపై మొక్కలు మొలిచి వృక్షాలుగా మారాయి. భవనం చుట్టూ గోడలపై, కిటికీలపై చెట్లు పెద్దపెద్ద వృక్షాలుగా మారాయి. జువ్వి చెట్ల పండ్లను పక్షులు తిని రెట్ట వేస్తుండడంతో భవనం గోడలపై మొలిచాయి.

## నేలవాలిన వరి

బండిఆత్మకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గాలితో కూడిన వానకు పలు గ్రామాల్లో వరి పంట నేల వాలింది. సోమవారం మధ్యాహ్నం మండలంలోని వెంగళరెడ్డిపేట, కడమలకాల్వ, ఈర్నపాడు, ఎ. కోడూరు, పార్నపల్లె గ్రామాల్లో గాలి వాన బీభత్సం సృష్టించింది. దీంతో వెన్ను విరిసిన వరి నేల కూలింది. దాంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. దిగుబడి తగ్గిపోతుందని, తద్వారా నష్టాలు రావటం ఖాయమని రైతులు వాపోతున్నారు.


వెంగళరెడ్డిపేటలో నేలకూలిన వరి పంట



# మల్లన్న సన్నిధిలో దిల్‌రాజు

శ్రీశైలం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను సోమవారం సినీ నిర్మాత దిల్‌రాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. నిర్మాత దిల్‌రాజు స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని అనంతరం అమ్మవారికి ప్రత్యేక అర్చనలు జరిపించుకున్నారు. దర్శనానంతరం నిర్మాత దిల్‌రాజుతో అభిమానులు ఫొటోలు తీసుకున్నారు.



ఆలయ ప్రాంగణంలో దిల్‌రాజు



# అక్కడ ఆది మానవుని జాడలు

- నాటి చరిత్రను చాటుతున్న కేతవరం గుహలు
- అప్పటి నాగరికతకు దర్పణంగా కుడ్య చిత్రాలు
- ఇప్పటికీ కొండల్లో దర్శనమిస్తున్న నాటి చిత్రకళా వైభవం

ఓర్వకల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దాదాపు లక్ష సంవత్సరాలకు పూర్వమే అక్కడ ఆది మానవుని జాడలు ఉన్నాయి. నాగరికతకు దర్పణంగా కుడ్య చిత్రాలు దర్శనమిస్తున్నాయి. చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకున్న ఆ గుహలు ఇప్పటికీ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఓర్వకల్లు మండలంలోని కేతవరం గ్రామంలోని గుహలు చరిత్రకు ఆనవాళ్లుగా నిలిస్తున్నాయి. ఇక్కడ ఉన్న కుడ్య చిత్రాలు ఆనాటి లిపితోపాటు వారి భాషను తెలుసుకునేందుకు ఉపయోగపడుతున్నాయి. పరిసరాల్లో ఆనాటి మానవుడు ఉపయోగించే వస్తువులు కూడా అక్కడక్కడా దర్శనమిస్తున్నాయి. ఇక్కడ కనిపించే శాసనాలు ద్రవిడుల ఆలోచనా విధానాన్ని తెలియజేసే రీతిలో ఉన్నాయి. ఆ పరిసర ప్రాంతాల్లో పర్యాటకులను ఆకర్షించేందుకు గెస్టు హౌస్, పిల్లలకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. అయితే.. గెస్టు హౌస్ తలుపులు, కిటికీలు తదితర వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు.. పర్యాటకులను ఆకర్షించేలా కేతవరం గ్రామం నుంచి అటవీ ప్రాంతానికి రోడ్డు వేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.. ఇప్పటికైనా రాష్ట్ర పర్యాటక శాఖ, పురావస్తు శాఖ అధికారులు ఆ ప్రాంతంపై దృష్టి సారించి పర్యాటక కేంద్రంగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కంప చెట్ల మధ్య వసతి గృహం


### ప్రాచీన రాళ్లపై లిపి చిత్రాలను సంరక్షించండి

మేము పిల్లలుగా ఉన్న సమయంలో ఆనాటి కలెక్టర్ కాశీ పాండే ఆదిమానవులు రాసిన లిపి, వివిధ బొమ్మలను గుర్తించారు. ఆ తర్వాత ఎందరో అధికారులు వస్తున్నారు.. వెళ్తున్నారు. నామమాత్రంగా రాతి బెంచీలు ఏర్పాటు చేసి వదిలేశారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆదిమానవులు రాతలను ఆకతాయిలు చెరిపేస్తున్నారు. ప్రాచీన చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - బలరాముడు, కేతవరం



### చరిత్ర ఆనవాళ్లు చెదిరిపోతున్నాయి

ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి సంరక్షించాలి. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని చరిత్ర ఆనవాళ్లను చెదిరిపోకుండా కాపాడాలి. మద్దిలేటి, కేతవరం


రాళ్లపై ఉన్న ప్రాచీన భాష

# 24న జాతీయ స్థాయి క్విజ్ పోటీలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి క్విజ్ పోటీలను ఈనెల 24న అంతర్జాలం జూమ్ యాప్ ద్వారా నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ ఢిల్లీలోని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు సర్టిఫికెట్లతోపాటూ నగదు బహుమతులు ఉంటాయని, ఆసక్తిగల 14 నుంచి 20 ఏళ్లలోపు విద్యార్థులు, యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు నగరంలోని వెంకటరమణ కాలనీలో మొదటి లైన్‌లోగల నైస్ కంప్యూటర్స్ శిక్షణ సంస్థ కార్యాలయంలో ఈనెల 22న సాయంత్రం 5 గంటల లోపు సంప్రదించవచ్చని తెలిపారు. ఎన్‌వైసీఈ డాట్ రాయపాటి ఎట్ జీమెయిల్ డాట్ కామ్‌లో జీమెయిల్ ద్వారా కూడా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

# జిల్లా స్కూల్ గేమ్స్ కోసం...

కర్నూలు స్పోర్ట్స్ అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 24న అండర్-17 బాలబాలికలకు యోగా, చెస్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. నంద్యాల, కర్నూలు క్రీడాకారులు ఎంపికకు హాజరు కావాలని కోరారు.

- 24న కబడ్డీ ఎంపిక: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నంద్యాల నూనెపల్లి మున్సిపల్ హై స్కూల్‌లో షటిల్, నంది అకాడమిలో నంద్యాలలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు గిడ్డయ్య, శ్రీనాథ్ తెలిపారు. ఎంపికను ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు హాజరు కావచ్చని తెలిపారు.
- ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో అండర్-14, 17 బాలబాలికలకు ఖో-ఖో, సాఫ్ట్‌బాల్, పవర్‌లిఫ్టింగ్, ఉషూ, సైక్లింగ్ బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు.


గోనెగండ్ల ఎస్సీ కాలనీ నుంచి వాహనాల్లో వెళ్తున్న కూలీలు

# ఉగాదికొస్తాం..!

- వలసెళ్లిపోతున్న పల్లె ప్రజలు
- పనుల కోసం పాట్లు
- హైదరాబాద్, గుంటూరు, రాజంపేటకు పయనం

గోనెగండ్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ ప్రాంతల నుంచి వలస బండ్లు కదులుతున్నాయి. మూడు రోజులుగా గోనెగండ్ల మండలాల నుంచి ప్రజలు వలసలు పోతున్నారు. సోమవారం రాత్రి గోనెగండ్ల ఎస్సీ కాలనీ నుంచి వంద కుటుంబాలు తెలంగాణాలోని కేసంపేట అనే గ్రామానికి రెండు వాహనాల్లో వలస వెళ్లాయి. మూడు రోజుల నుంచి గోనెగండ్ల మండల గ్రామాల నుంచి 400 కుటుంబాలకు పైగానే హైదరాబాద్, గుంటూరు, రాయచూరు, రాజంపేట పట్టణాలకు కూలీలు వలసలు వెళ్లాయి. అక్కడ పత్తి పొలాల్లో పనులకోసం వెళ్తున్నట్లు కూలీలు చెబుతున్నారు. కిలో పత్తి తీస్తే రూ.13 ఇస్తారని, ఆ మేరకు ఒప్పందం కుదుర్చుకొని సుగ్గీ వెళ్తున్నామని చెబుతున్నారు. మళ్లీ ఉగాది పండుగకు ఊరికి వస్తామని కూలీలు బరువెక్కిన హృదయంతో ఊళ్లను వదిలేసి వెళ్తున్నారు. స్థానికంగా కూలీ పనులు లేవని, భార్యా పిల్లలు, తల్లిదండ్రులను పస్తులు ఉంచలేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పంటలు సరిగా పండక పోవడంతో పనులు లేవు. గ్రామాల్లో అధికారులు సైతం ఉపాధి పనులు కల్పించడం లేదు. అరకొర పనులు కల్పించినప్పటికి కూలీ డబ్బులు గిట్టుబాటు కాకపోవడం, అవి కూడా సకాలంలో చెల్లించకపోవడంతో ఇక గ్రామాల్లో లాభం లేదని వలసలు వెళ్తున్నామని పలువురు కూలీలు పేర్కొన్నారు. వేముగోడు గ్రామంతోపాటు గోనెగండ్ల, అలువాల, చిన్నమరివీడు, పెద్దనేలటూరు, కులుమాల, బైలుప్పల, అగ్రహారం, గంజహళ్లి గ్రామాల ప్రజలు ప్రత్యేక వాహనాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు.

### గ్రామంలో కూలీ పనులు లేవు

నెల రోజులుగా గ్రామంలో కూలీ పనులు లేవు. పూట గడవడం కష్టంగా మారింది. ఉపాధి పనులు కూడ సరిగా జరగడం లేదు. అందుకని తెలంగాణకు వలస పోతున్నాం. నేను, నా భార్య పిల్లలు అందరం వెళ్తున్నాం. అక్కడ పత్తి పని ఉంది. కేజీ పత్తి తీస్తే రూ.13 ఇస్తారు. అందుకే వెళ్తున్నాం. మళ్లీ ఉగాది వరకు వచ్చేది లేదు.

-మద్దిలేటి, గోనెగండ్ల



# మీసాలు, గడ్డాలు ఉండొద్దు




- మేం చెప్పిన కంటి అద్దాలే ధరించాలి
- కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్
- జూనియర్లను వేధిస్తున్న సీనియర్లు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో సీనియర్ విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులను ర్యాగింగ్ చేస్తున్నారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం మొదలై వారం రోజులకే సీనయర్ల వేధింపులు తీవ్రమయ్యాయి. దీంతో కొత్త విద్యార్థులు బయటకు చెప్పుకోలేక లోలోన కుమిలిపోతున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లు 250 ఉన్నాయి. ఈ నెల 14న 240 మంది కొత్త వైద్య విద్యార్థులు చేరారు. సీనియర్లు ర్యాగింగ్ పేరుతో కొత్త విద్యార్థులను హింసిస్తున్నట్లు తెలుస్తోంది. సాయంత్రం తరగతులు ముగిసే సమయానికి గుంపులుగా చేరి ఐడీలను చూపాలని మొదటి సంవత్సరం విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నారు. మీసాలు, గడ్డాలు తీసేసి కాలేజీకి రావాలని, తాము చెప్పిన కళ్లజోడు మాత్రమే పెట్టుకోవాలని, షూ లేకుండా చెప్పులతో కాలేజీకి హాజరు కావాలని హుకుం జారీ చేస్తున్నారు. అకాడమిక్ అంశాలకు సంబంధించిన పుస్తకాలను కొనవద్దని, తాము సూచించిన ఆన్‌లైన్ యాప్‌లను మాత్రమే కొనాలంటూ బెదిరింపులకు దిగుతున్నారు.

### మూడు రోజుల క్రితమే ర్యాగింగ్‌పై సదస్సు

కొత్తగా వచ్చిన ఎంబీబీఎస్ విద్యార్థులకు మూడు రోజుల క్రితమే కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన యాంటి ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకటశేషాద్రి, జిల్లా ఎస్పీ బిందుమాధవ్ హాజరై ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. ఇటువంటి తరుణంలో సీనియర్లు వేధింపులకు పాల్పడుతుండడంతో మొదటి సంవత్సరం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే చిట్టినరసమ్మను వివరణ కోరగా ర్యాగింగ్ వేధింపుల విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు నాన్ క్లినిక్‌లో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను హాస్టల్‌లో ఉండే విధంగా డ్యూటీలు వేశామని తెలిపారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలకు నగారా



- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కలెక్టర్
- జిల్లాలో 123 సంఘాలకు ఎన్నికలు
- ఆ తరువాత డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీల ఎంపిక

కర్నూలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేసీ కాలువ, తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ), హంద్రీనీవా, గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలోకి ఆయకట్టు రైతుల సాగునీటి సంఘాల సమరానికి సమయం ఆసన్నమైంది. జిల్లాలో 123 సంఘాలకు ఎన్నికలు నిర్వహణ, ఎన్నికల అధికారులను నియమిస్తూ కలెక్టరు పి.రంజిత్‌బాషా సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఏఏ సంఘం పరిధిలో ఏఏ గ్రామాలు వస్తాయి.. ఎంత ఆయకట్టు ఉంది వంటి అంశాలు గెజిట్‌లో స్పష్టంగా వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం 2015-26లో సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసి నామినేటెడ్ పద్ధతిలో ఆ పార్టీ కార్యకర్తలకే పదవులు పంచుకున్నారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో తొమ్మిదేళ్ల తరువాత పల్లెసీమల్లో సాగునీటి సంఘాల ఎన్నికలకు నగారా మోగింది. ఈ నెల 9న తేదీన రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 40 రోజుల ఎన్నికల ప్రక్రియకు మంత్రి వర్గం ఆమోదం తెలిపి షెడ్యూల్ కూడా జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం అయితే 16 నుంచి ప్రక్రియ మొదలు కావాలి. అయితే సాంకేతిక కారణాలు, రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు ఉమ్మడిగా ఆయకట్టు నిర్ధారణలో వంటి కారణాలు ప్రభుత్వం వాయిదా వేసింది. ఎట్టకేలకు వారం రోజులు ఆలస్యంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ కావడంతో ఆయకట్టు రైతులు ఎన్నికల సన్నద్ధం కావాల్సి వచ్చింది. నవంబరు 29న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని అధికారులు తెలిపారు.

### 123 నీటి సంఘాలకు ఎన్నికలు

జిల్లాలో కేసీ కెనాల్ పరిధిలో 2, తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) పరిధిలో 58, హెచ్చెల్సీ ఆలూరు బ్రాంచి కెనాల్ పరిధిలో 6, హంద్రీనీవా కెనాల్ పరిధిలో 3, గాజులదిన్నె ప్రాజెక్టు కింద 12, మైనర్ ఇగిరేషన్ చెరువుల కింద 41, రాంపురం చానల్ కెనాల్ కింద ఒకటి కలిపి 123 సాగునీటి సంఘాలు (డబ్ల్యూయూఏ) ఉన్నాయి. ఎంఐ పరిధిలోలో సంఘంలో సుమారుగా 30-50 మంది రైతులు, మేజర్ ఇరిగేషన్ సంఘాల పరిధిలో 100-120 మంది వరకు ఆయకట్టు రైతులు సభ్యులుగా ఉంటారని అంచనా వేస్తున్నారు. ఆయా సంఘాల పరిధిలో 1,212 మంది ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ) సభ్యులను ఎన్నుకోవాలి. ప్రతి సంఘం పరిధిలో ఆరుగురు టీసీ సభ్యులను ఎన్నుకుంటే.. ఆ సభ్యుల్లో ఇద్దరిని అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎంపిక చేస్తారు. సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నుకుంటుంది. డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు సమావేశమై ప్రాజెక్టు కమిటీని ఎంచుకుంటారు. జిల్లాలో 123 సాగునీటి సంఘాలు, 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 2 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు మూడు దశల్లో జరుగుతాయి.

### ప్రత్యేక అధీకృత అధికారుల నియామకం

గెజిట్ నోటిఫికేషన్‌తో పాటు ఎన్నికలు జరిగే సాగునీటి సంఘాలకు డీఈఈ, ఏఈఈ స్థాయి ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ అధికారి పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఆయా సాగునీటి కాలువ పరిధిలోని ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులు (తహసీల్దార్లు) సమన్వయంతో ఆయకట్టు రైతులు, ఓటర్ల జాబితాను తయారు చేయాల్సి ఉంది. ఇందుకోసం జిల్లా నుంచి ప్రత్యేక అధీకృత రెవెన్యూ అధికారులను నియమించారు. డీఈఈ, ఏఈఈలు, తహసీల్దార్లు నివేదించిన ఓటర్ల జాబితాను కలెక్టరు లేదా ఆర్డీఓలు అధికారికంగా ప్రకటిస్తారు. ఓటర్ల జాబితా తయారీ కోసం ఇరిగేషన్ ఇంజనీర్లు తహసీల్దార్లకు సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టరు పి.రంజిత్‌బాషా జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.



# ఎప్పుడైనా కూలొచ్చు..!





కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరానికి తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ప్రమాదంలో పడింది. మునగలపాడు సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు 16 పిల్లర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆ పిల్లర్లు మొత్తం శిథిలావస్థకు చేరుకున్నాయి. మొదటి రెండు పిల్లర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని అమర్చిన కడ్డీలు బయటకు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ కొందరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుపైకి వెళ్తున్నారు. ఈ క్రమంలో శిథిలావస్థకు చేరుకున్న ట్యాంకు పిల్లర్లు ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అనుకోని ప్రమాదం జరగకముందే అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు సంబంధించి మరమ్మతులను ఉన్నతాధికారులతో కలిసి యుద్ధప్రాతిపదికన చేపడతామని నగర పాలక ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు.



# ఉద్యోగం పేరుతో మోసం

- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితుల ఫిర్యాదు
- చట్ట ప్రకారం విచారణ చేసి న్యాయం చేస్తాం
- కర్నూలు ఎస్పీ జి.బిందు మాధవ్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ జి.బిందు మాధవ్

**కర్నూలు క్రైం అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** ఉద్యోగాలు ఇప్పిస్తామని తమను మోసగించారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్పీని కలిసి తమ గోడును వెలుబుచ్చారు. సోమవారం కర్నూలు నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు.

ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. మొత్తం 100 వినతులు వచ్చాయి. అలాగే వృద్ధురాలి వద్దకు నేరుగా వెళ్లి ఫిర్యాదు స్వీకరించి న్యాయం చేస్తానని ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ జి.బిందు మాధవ్ హామీ ఇచ్చారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

**ఇవీ వినతులు..**

కర్నూలు ఫుడ్ కార్పొరేషన్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.3.5 లక్షలు తీసుకుని తనను కర్నూలుకు చెందిన ఆయేషా బాను మోసగించిందని వినయ్‌గౌడ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

- నదీతీర ప్రాంతాల పోర్టులో థర్డ్ ఆఫీసర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలుకు చెందిన వై.నాగేశ్వరరావు రూ.ఏడు లక్షలు తీసుకుని మోసం చేశాడని ఆదోనికి చెందిన ప్రవీణ్ ఫిర్యాదు చేశారు.
- అత్తమామలు కుటుంబ సమస్యలు, అవసరాల కోసం తన బంగారం తీసుకుని వాడుకున్నారు. ఇప్పుడు అడిగితే.. ఇవ్వడం లేదని కర్నూలు పసుపుల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళ ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలని వేడుకున్నది.
- తాను అనంతపురంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాను. నాకు ఫేస్‌బుక్ ద్వారా కార్తీక్ పరిచయం అయ్యాడు. రూ.7 లక్షలు తీసుకుని మోసం చేశాడని గూడూరు మండలం నాగులాపురం చెందిన సలీమా ఫిర్యాదు చేశారు.
- నా కుమార్తె కేశమ్మ ఎంబీఏ చేసింది. నా కుమార్తెకు అల్బాబీట్ గ్రూప్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నమ్మించి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేసిన అనంతపురం చెందిన సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని గూడూరు మండలం గుడిపాడుకు చెందిన రైతు దుబ్బన్న ఫిర్యాదు చేశారు.
- తనకు ఇద్దరు కుమారులు, చిన్న కుమారుడికి కంటి చూపు సరిగ్గా లేదు. పెద్ద కుమారుడు వెంకటేశ్వర ఆచారి నాకు వచ్చిన ఇల్లును తీసుకుని అన్నం, బాగోగులు చూడడం లేదని, బిక్షాటన చేయిస్తున్నాడని కర్నూలుకు చెందిన మునెమ్మ ఫిర్యాదు చేసింది.

# పన్ను వసూళ్లలో గణనీయ వృద్ధి



పన్ను వివరాలను కమిషనర్‌కు అందజేస్తున్న అడిషనల్ కమిషనర్

- కమిషనర్ ఎస్.రవీంద్రబాబు

**కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థ పరిధిలో పన్ను వసూళ్లలో గణనీయ వృద్ధి సాధించినట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. ఈ నెల 17 నుంచి రెవెన్యూ విభాగం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ ద్వారా రూ.94,53,000 పన్ను వసూలు చేసిన వివరాలను అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ కమిషనర్‌కు అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరాభి వృద్ధికి పన్నులు ఎంతో కీలకమన్నారు. దీనిని గ్రహించి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించడం సంతోషంగా ఉందన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఆస్తిపన్ను రూ.89,25,000, నీటి పన్ను రూ.5,28,000 వసూలు చేశారన్నారు. నూతనంగా నియమితులైన ఆర్‌ఐలు పన్ను వసూలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. సిబ్బందిని కమిషనర్ అభినందిం చారు. ఆర్వో జునైద్, ఆర్‌ఐలు శేషాద్రి, ఎం.రాజు, ఎస్.తిప్పన్న, పి.భార్గవత, ఎం.నాగరాజు ఉన్నారు.

# చిన్నారుల బాధ్యత ప్రభుత్వానిదే



చిన్నారులతో ఐసీడీఎస్, ఎసీపీఎస్ అధికారులు

**పత్తికొండ, అక్టోబరు 21 :** మండలంలోని మారెళ్ల గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని పత్తికొండ సీడీపీవో లలిత అన్నారు. సోమవారం కర్నూలు నుంచి వచ్చిన ఐసీపీఎఫ్ (ఇంటిగ్రేటెడ్ చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ స్కీం) అధికారులు పద్మ, శ్రీలక్ష్మి చిన్నారులతో మాట్లాడారు. చట్టప్రకారం తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను చైల్డ్‌వెల్ఫేర్ కమిటీకి అప్పగించాల్సి ఉంటుందని అన్నారు. వారి విద్యాభ్యాసానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. బంధువులు చిన్నారుల బాధ్యత వహిస్తామని కోరితే నిబంధనల మేరకు అనుమతిస్తామన్నారు. సూపర్ వైజర్ సుమిత్ర, కార్యకర్త ఉన్నారు.

# పట్టపగలే చోరీ

**కోసిగి అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లోకి చొరబడి బంగారం, నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన కోసిగి మండల కేంద్రంలోని దొరల చావిడి సమీపంలో సోమవారం చోటు చేసుకున్నది. బాధితురాలు జక్కనగేని శివమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కనగేని ఉశేనీ, శివమ్మ దంపతులు. ఉశేనీ, తన కూతురుతో కలిసి పుణ్యక్షేత్ర తీర్థాలకు వెళ్లారు. ఇద్దరు కుమారులు బడికి వెళ్లడంతో రోజులాగే ఇంటికి తాళం వేసి ఉల్లి నారు వేసేందుకు కూలి పనికి శివమ్మ వెళ్లింది. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులకొట్టి బీరువాలో ఉన్న రూ.1.40 లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం దోచుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పి.చంద్రమోహన్ సంఘటనాస్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. దొంగలు ఇంట్లోనే బీర్ సీసా పగులకొట్టారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# నిశ్చితార్థాలను అడ్డుకున్న అధికారులు



తల్లిదండ్రులకు అవగాహన పత్రం ఇస్తున్న డీసీపీవో శారద

**కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ఒకేసారి ఇద్దరు బాలికల నిశ్చితార్థాలను ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మి ఆదేశాల మేరకు మూడు ప్రాంతాల్లో అడ్డుకున్నారు. సి.బెళగల్ మండలం కంబదహాల్ గ్రామంలో 15 సంవత్సరాల బాలిక, కర్నూలు మండలం గొందిపర్లలో 17 సంవత్సరాల అమ్మాయిలకు చేస్తున్న నిశ్చితార్థం కార్యక్రమాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డీసీపీవో టి.శారద మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల శారీరక మానసిక సమస్యలతోపాటు పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా జన్మించరని తెలిపారు. కౌన్సెలింగ్ ఇవ్వగా తల్లిదండ్రులు సమ్మతించి నిశ్చితార్థాన్ని విరమించారు. తల్లిదండ్రులు అంగీకార పత్రాన్ని అధికారులకు రాసి ఇచ్చారు. డీసీపీవో టి.శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, మల్లేశ్వరి, డీసీపీయూ సిబ్బంది నరసింహులు, నాగేశ్వరరావు, శ్వేత, కీర్తి, మహిళా పోలీసు సృజన నాయుడు, ఆర్గనైజేషన్ మధు, రామచేంద్ర పాల్గొన్నారు.

# టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన ఉండాలి



ఆటోకు పోస్టర్ అంటిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

**నంద్యాల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1930పై అవగాహన కలిగి ఉండాలని నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జయరాములు, రమేష్ బాబుతో కలిసి 112, 1930 టోల్ ఫ్రీ నెంబర్లపై ముద్రించిన పోస్టర్లను ఆటోలకు అతికించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, చిన్న పిల్లలు, ఇతరులు ఎవరైనా బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గృహ హింస, అవమానానికి గురిచేయడం, బెదిరించడం తదితర వాటివల్ల ఇబ్బంది పడినట్లయితే వెంటనే 112, 1930 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అలాగే సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి వాటిద్వారా సైబర్ నేరగాళ్ల చేతిలో పడి మోసపోయి ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ నెంబర్లపై అవగాహన కోసమే ఆటోలకు అతికించామని అన్నారు. కార్యక్రమానికి నాంది పలికిన జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జయరాములును ఎస్పీ అభినందించారు.

# ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

**నంద్యాల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 28 వరకు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం నంద్యాలలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాక ముందు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తా మని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వ మేర్పడి నాలుగు నెలలు కావస్తున్నా ఆ హామీ అతీగతి లేదని విమర్శించారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపు మేరకు వారం రోజులపాటు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాల్లో పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, కో ఆర్డినేషన్ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఓపీ విధుల్లో ఉండాలి

**కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులు ఓపీ విభాగాల్లో ఉదయం, సాయంత్రం వైద్యులు తప్పనిసరిగా సేవలు అందించాలని ఓపీ మానిటరింగ్ కమిటీ సభ్యులు హెచ్చరించారు. సోమవారం ఉదయ గైనిక్, ఫ్యామిలి ప్లానింగ్, పీడియాట్రిక్ విభాగాల ఓపీ సేవలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి నెల 5న ఓపీ సేవల వివరాలను కమిటీ సభ్యులు డీఎంఈకి నివేదిక పంపనున్నట్లు సీఎస్ఆర్ఎంవో తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, యురాలజీ హెచ్‌వోడీ సీతారామయ్య, సైక్రియాట్రిక్ హెచ్‌వోడీ నాగేశ్వరరావు ఉన్నారు.

## డ్రోన్స్ సమ్మిట్‌కు సుబ్బారెడ్డికి ఆహ్వానం

**డోన్ అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** అమరావతిలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించే డ్రోన్స్ సమ్మిట్ కార్యక్రమానికి రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డికి ఆహ్వానం వచ్చింది. డ్రోన్స్ సమ్మిట్ కార్యక్రమంలో జరిగే వర్క్‌షాపులో పాల్గొనాలని ఆహ్వానం పంపారు. దీంతో సుబ్బారెడ్డి విజయవాడకు వెళ్లారు. ఇది ఒక మంచి అవకాశంగా భావిస్తున్నట్లు సుబ్బారెడ్డి తెలిపారు.

# మొరాయించిన ఈ నామ్ సర్వర్

- పాత పద్ధతిలోని టెండర్ దాఖలు



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

**ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి) :** ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ-నామ్ సర్వర్ సోమవారం సాంకేతిక సమస్యతో మొరాయించింది. అప్రమత్తమైన కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి సమస్య పరిష్కారం కావడానికి ఒక్కరోజు పట్టవచ్చని తెలియడంతో పాత పద్ధతిలోని టెండర్లు వేయాలని మైకు ద్వారా ప్రకటించారు. దేశవ్యాప్తంగా మార్కెట్ యార్డులో సర్వర్ పని చేయక పాత పద్ధతిలోనే టెండర్లను దాఖలు చేశారు. ఖరీఫ్ సీజన్ పత్తి, వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు దిగుబడు లను రైతులు విక్రయానికి భారీగా తీసుకొస్తు న్నారు. ఇలాంటి సమయంలో సర్వర్ మొరాయిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తూకాలు సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమయ్యాయి.

## నిందితుల అరెస్టు

**కర్నూలు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడ్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సురేష్, భార్య ధనలక్ష్మి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. కర్నూలుకు చెందిన అనూషతోపాటు మరో 18 మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, నకిలీ ఉద్యోగ పత్రాలు ఇచ్చి రూ.95 లక్షలు వసూలు చేసి మోసం చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.






# కారు బోల్తా

- ఐదుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన కారు


**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) :** కారు బోల్తా పడి, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై పేరాయిపల్లె మెట్ట వద్ద సోమవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఓ కుటుంబ సభ్యులు మహానందిలో స్వామి వారిని దర్శించుకుని అహోబిలం వెళ్తుండగా పేరాయిపల్లె వద్ద కారు టైరు పేలడంతో ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో కారు పల్టీలు కొట్టి డివైడర్‌ను దాటి నంద్యాల వైపు వెళ్లే రహదారిలో బోల్తా పడింది. ఈ ఘటనలో సాయి వెంకటేష్, రమాదేవి, ఝాన్సీ, సుధీర్, శశి తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

## యువకుడికి రిమాండ్

**ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** కిడ్నాప్ కేసులో ఓ యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన మాదిగ అభిలాష్ అనే యువకుడు ఓ బాలికను ఎత్తుకెళ్లడంపై కేసు నమోదు అయింది. యువకుడిని కోర్టులో హాజరుపరిచి న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# పొంచి ఉన్న ప్రమాదం

- పెచ్చులూడుతున్న పాఠశాల భవనం పైకప్పు
- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- చెట్టుకింద కొనసాగుతున్న తరగతులు


శిథిలావస్థలో పాఠశాల


పాఠశాల ఆవరణలో చెట్టు కింద విద్యార్థులు

**కొత్తపల్లి అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** సుమారు 50 సంవత్సరాల కింద నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉంది. విద్యార్థులు భయాందోళన చెందుతుండటంతో ఆ పాఠశాల ఉపాధ్యాయులు చేసేదేమీ లేక చెట్టు కిందనే బోధన చేస్తున్నారు. దుద్యాల మండల ప్రజా పరిషత్ మెయిన్ పాఠశాలలో 1, 2 తరగతులకు చెందిన 24 మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ పాఠశాలలో అందరూ 8 సంవత్సరాలలోపు విద్యార్థులే ఉన్నారు. ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు పాఠశాల పెచ్చులు ఊడి పడటంతో ఒక చిన్నారికి సైతం గాయాలైనట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పనులు చేపట్టిందని, అయితే ఇలాంటి పాఠశాలలు కనిపించలేదా? అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని, పాఠశాలకు పంపించాలంటేనే భయంగా ఉందని విద్యార్థుల తల్లి దండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై ఎంఈవో-2 ఇనయతుల్లాను వివరణ కోరగా.. ఈ పాశాలను త్వరలో కూల్చివేసేందుకు అనుమతులు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం పక్కనే ఉన్న ఉర్దూ పాఠశాలకు మార్పు చేస్తామని చెప్పడం గమనార్హం.


పెచ్చులూడిన గది పైకప్పు

## దెబ్బతిన్న పంటల పరిశీలన


నందిపల్లిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

**మహానంది, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** పెనుగాలులు తుఫాన్ వల్ల దెబ్బతిన్న వరి పంటలను నంద్యాల ఏడీఏ రాజశేఖర్ పరిశీలించారు. మండలంలోని నందిపల్లి, యి.బొల్లవరం గ్రామాల పరిధిలోని పంట పొలాల్లో నేల వాలిన వరి పంటను సోమవారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ మరి కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి, మొక్కజొన్నతో పాటు ఇతర పంటల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పడిపోయిన వరి మొక్కలకు కట్టలు కట్టుకోవాలని సూచించారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## 'తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి'


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

**గడివేముల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** శనగ పంట సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు జాన్సన్ రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. మండలంలోని ఎల్‌కే తండా గ్రామంలో సోమవారం గిరిజన ఉప ప్రణాళిక కింద ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల నిర్వహణలో భాగంగా ఎంపిక చేసిన 20 మంది రైతులకు శనగ విత్తనాలు, వేపనూనె, క్రిమి సంహారక మందులు, టార్పాలిన్ పట్టలను పంపిణీ చేశారు. శనగ పంటలో రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రామకృష్ణారావు, నీలిమ, చైతన్య, మండల వ్యవసాయాధాకారి హేమసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## 'సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి'


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్

**నందికొట్కూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** డిసెంబరు 9, 10వ తేదీల్లో నందికొట్కూరులో నిర్వహించే సీపీఎం జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని జై కిసాన్ పార్కులో సోమవారం సీపీఎం నాయకులు సమావేశం నిర్వహించారు. రమేష్ కుమార్ మాట్లాడుతూ సీపీఎం గత మూడు సంవత్సరాలుగా చేసిన ఆందోళన, పోరాటాల ఫలితాలను, ప్రజా ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణకు ప్రణాళికలు డిసెంబరు నెలలో జరిగే సీపీఎం జిల్లా రెండవ మహాసభల్లో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు, యేసురత్నం, జిల్లా కమిటీ సభ్యులు స్వామన్న, రణధీరు, రత్నమయ్య, నరసింహ, శోభ రాణి, తదితర అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఉండాలి


వ్యవసాయ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న ఏవో

**కొత్తపల్లి అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయాధికారి మహేష్ సూచించారు. అకాల వర్షాలపై రైతులు పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల రైతు సేవా కేంద్ర సిబ్బందికి మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రధానంగా వరి పంటలో వర్షం నీరును బయటకు పంపించి 20 కేజీల యూరియా, 20 కేజీల ఎంవోపీ సైపాట్‌గా వేయడం వల్ల పంట పుంజుకుంటుందన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా అప్రమత్తం చేయాలని సూచించారు.

## వడ్డెమానులో సోలార్ విద్యుత్ ఏర్పాటు


సోలార్ విద్యుత్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

**నందికొట్కూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సూర్యఘర్ యోజన పథకం గ్రామాలకు కూడా చేరుతోంది. అందులో భాగంగా నందికొట్కూరు మండలం వడ్డెమాను గ్రామానికి చెందిన రమణారెడ్డి అనే వ్యక్తి తన ఇంటిపై సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేశారు. క్రాంతి సోలార్ పవర్ ఎనర్జీ అనే సంస్థ ద్వారా ఈ పథకాన్ని వినియోగించుకున్నట్లు వినియోగదారుడు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ బి.రాములునాయక్, జేఎల్ఎం తిరుపాల్, సూర్యచంద్ర పాల్గొన్నారు.

## శ్రీశైలంలో వెండి రథోత్సవం


స్వామి, అమ్మవార్ల వెండి రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు, సిబ్బంది

**శ్రీశైలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్క రించుకొని లోక కళ్యాణార్థం మల్లికార్జున స్వామి, భ్రమ రాంబ అమ్మవార్లకు సాయంత్రం వెండి రథోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహిం చింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంక రించి వేదికపై ఆశీనులు జేసి, అర్చకులు వేద మంత్రోచ్చర ణలతో పూజలు జరిపారు. అనంతరం సహస్ర దీపాలం కరణ సేవ నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై అశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళ హార తులు ఇచ్చి ఆలయ ప్రాంగ ణంలో రథోత్సవాన్ని నిర్వహిం చారు. ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి ఇ. చంద్రశేఖరరెడ్డి, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

- శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో సోమవారం మార్కాపురానికి చెందిన శ్వేత నాట్య అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణేష్ ప్రార్థన, మహిషాసుర మర్దిని, శివ తాండవం, శంభో శివ శంభో, తాండవ నృత్యం, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో భక్తులను ఆకట్టుకున్నారు.


నృత్యం చేస్తున్న కళాకారులు

## మహానందిలో పల్లకీ ఉత్సవం


మహానందిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

**మహానంది, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీ ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా కల్యాణ మంటపంలో వేద పండితుడు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తుల శివనామస్మరణ మధ్య ఆలయ ప్రాంగ ణంలో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమరుల త్యాగం మరువలేనిది


బండిఆత్మకూరులో నివాళి అర్పిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

**బండిఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగం ఎన్నటికీ మరువలేనిదని ఎస్ఐ జగన్మోహన్ అన్నారు. సోమవారం పోలీస్ అమరవీరుల దినోత్స వాన్ని పురష్కరించుకుని, అమరుల చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. సమాజ సేవలో పోలీసుల పాత్ర ఎంతో కఠినతర మైనదన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవా ళ్లను ఎదుర్కొంటూ ప్రాణాలు సైతం లెక్క చేయని సోదరులెందరో అమరులు అయ్యా రని వారి సేవలను ఎస్ఐ కొనియాడారు.

## 24లోపు సర్వే పూర్తి చేయాలి: కలెక్టర్

**నంద్యాల కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం కింద వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే సర్వే ప్రక్రియను ఈనెల 24వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా సాయి కమిటీ కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఈ ఏడాది నిర్దేశించిన 26,784 మంది నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో అపలోడ్ చేయడంతో పాటు సంబంధిత నిరక్షరాస్యులకు ఉచిత విద్యాబోధన అందించేందుకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద టీచర్లను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, సామాజిక కార్యకర్తలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం డీఆర్డీఏ, ఐసిడిఎస్, విద్యాశాఖ, పంచాయత్‌రాజ్ శాఖల సమన్వయంతో ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

## మాజీ సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే సంతాపం


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా


**వెలుగోడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని వేల్పనూరు గ్రామ మాజీ సర్పంచ్ రామ తులసమ్మ(80) అనా రోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు సోమ వారం వేల్పనూరులో నిర్వహిం చారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి వేల్పనూరుకు చేరుకొని రామతులసమ్మ మృతదేహానికి నివాళి ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభం


మాట్లాడుతున్న అభిరుచి మధు

**నంద్యాల కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** బీజేపీ సాధారణ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారంతో ముగిసిందని, సోమవారం నుంచి నవంబరు 1వ తేదీ వరకు క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు తెలిపారు. సోమవారం నంద్యాల బీజేపీ పార్టీ కార్యాలయంలో అభిరుచి మధు అధ్యక్షతన బీజేపీ క్రియాశీలక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అభిరుచి మధు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు చాలా చక్కగా నిర్వహించారని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రమేష్‌నాయుడు, మేడా మురళి, కశెట్టి కృష్ణమూర్తి, డాక్టర్ ఆదినారాయణ, నాగరాజు, లింగన్న, దామోదర్‌రెడ్డి, ఆర్లగడ్డ లక్ష్మీరెడ్డి, మైనార్టీ మోర్చా జాతీయ కమిటీ సభ్యురాలు షబానా, అన్ని అసెంబ్లీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'


మాట్లాడుతున్న శివశంకర్

**వెలుగోడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** వెలుగోడు మండలంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వెలుగోడు మండల విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు శివశంకర్, కిశోర్, గణేశ్ డిమాండ్ చేశారు. సోమవారం వెలుగోడులోని సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మండలంలోని ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ కళాశాలలను ప్రైవేట్ పరం చేసి పేద మధ్యతరగతి ప్రజలను చదువుకు దూరం చేశారని అన్నారు. దీంతో విద్యార్థులు విద్యను అభ్యసించడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. అలాగే మోడల్ స్కూల్, కేజీబీవీలో సీసీ రోడ్లు నిర్మించాలని, కేజీబీవీలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## నేడు జాబ్‌మేళా

**ఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి, సీడాప్ కోఆర్డినేటర్ రమణ సూచించారు. సోమవారం వారు మాట్లాడుతూ నాలుగు కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంట ర్వ్యూల ద్వారా ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు.

## నేటి నుంచి ఆధార్ క్యాంపులు

**మిడుతూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం నుంచి 25వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీవో దశరథ రామయ్య సోమ వారం తెలిపారు. ఈ నెల 22న తిమ్మా పురం, మాసపేట, అలగనూరు, జలకనూరు గ్రామాల్లో, 23న చౌట్కూరు, చింతలపల్లి, నాగలూటి గ్రామాల్లో, 24న మిడుతూరు-1,2 గ్రామాల్లో, దేవనూరులో, 25న చెరుకుచెర్ల, వీపనగండ్ల గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

**జూపాడుబంగ్లా:** మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం నుంచి ఈ నెల 25 వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గోపీకృష్ణ తెలిపారు. మంగళవారం పారుమంచాల గ్రామంలో, 23న తరిగోపుల, 24న 80బన్నూరు, 25న తాటిపాడులో క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

## మృతుడి వివరాలు లభ్యం

**ఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని దుద్యాల రస్తా సమీపంలోని ఆర్టీటీ కాలనీ శివారులో ఆదివారం లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం ఆచూకీ సోమవారం లభించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నంద్యాలలోని నడిగడ్డవీధికి చెందిన మొల్ల సయ్యద్ బషీర్ అహ్మద్ (45) బంగారు దుకాణంలో పని చేస్తుండేవాడు. కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే మనస్తాపానికి గురై ఆదివారం ఆత్మకూరు పట్టణ శివారులోని ఆర్టీటీ కాలనీ సమీపంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే బషీర్ అహ్మద్ ఆచూకీ లేకపోవడంతో పోలీసులు ఆయన మృతదేహం గురించి ప్రచార మాధ్యమాల ద్వారా తెలియజేయడంతో నంద్యాలలోని వారి కుటుంబీకులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జైలు శిక్ష

**నంద్యాల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల పట్టణంలోని మహానంది రోడ్డువైపు నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా తన సిబ్బందితో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా పట్టుబడిన ఒక వ్యక్తిని కోర్టులో హాజరు పరచగా జడ్జి 10రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు సిబ్బందితో డ్రైంకెన్ డ్రైవ్ చేపట్టగా నంద్యాల మండలం సుగాలి మెట్టకు చెందిన కె.నాగేంద్ర అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.రామభూపాల్‌రెడ్డి నిందితుడికి పదిరోజుల జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## 'మద్యం దుకాణాలను తొలగించాలి'

**నంద్యాల కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల పద్మావతీ నగర్‌లో రెండు మద్యం షాపులు ఏర్పడగా, ప్రధానంగా లిక్కర్ మార్టులో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శి రామినేని రాజునాయుడు కోరారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రాజునాయుడు మాట్లాడుతూ పద్మావతీ నగర్‌లో కళాశాలు, ఆసుపత్రులు ఉన్నాయన్నారు. దీంతో మహిళలు, విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, పాణ్యం మండలం తొగర్చేడుమెట్ట వద్ద ఏర్పాటుచేసే మద్యం దుకాణం దగ్గరలో దేవాలయం, బస్‌షెల్టర్ ఉందని, బలపనూరుమెట్ట వద్ద గల నూతనంగా ఏర్పాటుచేసే మద్యం దుకాణం తొలగించాలని కోరారు.

# నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

**ఆత్మకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు మండలంలో రీసర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో మంగళవారం నుంచి రీసర్వే సంబంధిత భూసమస్యలపై గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 22న కరివేన, 23న కృష్ణాపురం, 24న నల్లకాల్వ, 25న పిన్నాపురం, 26న సిద్ధాపురం, 29న సిద్ధేపల్లి, 30న వడ్లరామాపురం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల గ్రామసభలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కాగా ఆత్మకూరు, ఇందిరేశ్వరం, కురుకుంద గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తికానుందున ఆయా గ్రామాల్లో ప్రస్తుతం గ్రామసభలను నిర్వహించడం లేదని వెల్లడించారు.

**బండిఆత్మకూరు:** మండలంలోని భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో ఈనెల 22వ తేది నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ అల్‌ఫ్రెడ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 22న భోజనం గ్రామంలో, 23న ఎ.కోడూరు, 24న బి.కోడూరు, 25న కాకనూరు, 26న నారాయణాపురం, 29న పరమటూరు, 30న పార్నపల్లె, వచ్చేనెల 1న పెద్దదేవళాపురం, 2న సంతజూటూరు, 5న ఎర్రగుంట్ల గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.

**మహానంది:** మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు సోమవారం తెలిపారు. 22న బసవాపురంలో, 23న యి.బొల్లవరం, 24 న గోపవరం, 25న మసీదుపురం, 26న నందిపల్లె, 29న ఎం.తిమ్మాపురం లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు.

**పాణ్యం:** మండలంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు నరేంద్రనాథరెడ్డి తెలిపారు. 22న ఆలమూరు, 23న అనుపూరు, 24న చిలకల, 25న గోనవరం, 26న గోరుకల్లు, 29న కొండజూటూరు, 30న కొనిదేడు, నవంబరు 1న కౌటూరు, 2న మద్దూరు, 3న నెరవాడ, 4న పిన్నాపురం, 5న ఎస్ కొత్తూరు, 8న తమ్మరాజుపల్లె, 12న తొగర్చేడు గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**గడివేముల:** భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకట రమణ తెలిపారు. 22న బూజనూరు, 23న దుర్వేశి, 24న గడివేముల, 25న కరిమద్దెల, 26న కొరటమద్ది, 29న మంచాలకట్ట, 30న పెసరవాయి గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

**వెలుగోడు:** మండలంలో రీ సర్వే పూర్తయిన గ్రామలలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీనివాసగౌడ్ తెలిపారు 22న బోయరేవుల, 23న మోతుకూరు, 24న అబ్దుల్లాపురం, 25న గుంతకందాల, 26న రేగడగూడూరు గ్రామాలలో ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**మిడుతూరు:** మండలంలో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. 22న అలగనూరు, 23న 49 బన్నూరు, 24న చెరుకుచెర్ల, 25న చింతలపల్లి, 26న కడుమూరు, 29న మాసపేట, 30న నాగలూటి, నవంబరు1న సుంకేసుల, 2న తిమ్మాపురం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**కొత్తపల్లి:** మండలంలో మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. 22న కొత్తపల్లి, 23న నందికుంట, 24న శివపురం గ్రామాల్లో ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**నంద్యాల రూరల్:** మండలంలో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రియదర్శిని తెలిపారు. మంగళవారం అయ్యలూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

## దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన


మినుము పంటను పరిశీలిస్తున్న ఏవో రంగనేతాజీ

**చాగలమర్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ముత్యాలపాడు, గొడిగనూరు, డి.వనిపెంట, చక్రవర్తులపల్లె గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను ఏవో రంగనేతాజీ సోమవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించేందుకు నష్టపోయిన పంటల వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. ఆయా గ్రామాల రైతులు దెబ్బతిన్న పంటల వివరాలను ఆర్బీకేలలో నమోదు చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఏఈవోలు, వీఏఏలు ఉన్నారు.

## ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు

**శిరివెళ్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) :** ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మెరుగవుతాయని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జనార్దనుడు అన్నారు. కళాశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కర్నూలులోని 28వ ఆంధ్రా బెటాలియన్ నుంచి సుబేదార్ విజయ్ కుమార్, హవల్దార్ రత్తయ్య కళాశాల నుంచి 20 మంది విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యలో సీట్లు సాధించేందుకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ యూనిట్ ఆఫీసర్ ఖాసీం సాహెబ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

**చాగలమర్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** అంగన్‌వాడీ వర్కర్లు విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. సోమవారం చాగలమర్రిలోని కోటగడ్డ వీధిలోగల అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను, ఎనిమిది కేంద్రాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

## ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించండి

**కోవెలకుంట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని పలు గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులచే త్వరగా పూర్తి చేయించాలని సిబ్బందికి ఎంపీడీవో వరప్రసాద్ సూచించారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో వరప్రసాద్ మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మించుకునేలా సిబ్బంది అవగాహన కల్పించి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మద్దిలేటి, ఏపీవో శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ

**డోన్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** గొర్రెలు, మేకలకు సామూహిక నట్టల నివారణ మందులు తాపించినట్లు డోన్ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు అన్నారు. 2,500 గొర్రెలు, మేకలకు సామూహిక నట్టల నివారణ మందును తాపించినట్లు ఆయన తెలిపారు. 30వ తేదీ వరకు సామూహిక నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.







# గ్రంథాలయానికి గ్రహణం

- శిథిలావస్థకు చేరుకున్న భవనం
- 38 ఏళ్లుగా గ్రామ చావిడిలోనే..
- వర్షానికి కారుతున్న పైకప్పు
- తడిసిపోతున్న పుస్తకాలు

కొలిమిగుండ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)

**కొలిమిగుండ్ల గ్రంథాలయం భవనం శిథిలావస్థకు చేరుకుంది. చిన్నపాటి వర్షానికే పైకప్పు కారుతుండతంతో పుస్తకాలు, దినపత్రికలు తడిసిపోతున్నాయి. అలాగే విద్యుత్ సౌకర్యాం కూడా లేదు. తాగునీటి వసతి కల్పించకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నా పట్టించుకున్న దాఖాలు లేవని పాఠకులు వాపోతున్నారు.**

1986లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మండలాల్లో గ్రంథాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకవచ్చారు. అసమయంలోనే కొలిమిగుండ్లలో తేరు వద్ద ఉన్న గ్రామ చావిడిలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే శిథిల చావిడిలో గ్రంథాలయం కొనసాగుతోంది. గత కొన్నేళ్లుగా భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని గోడలు పడిపోయి, పైకప్పు కారుతుండటంతో గ్రంథాలయంలోని విలువైన పుస్తకాలు తడిసిపోతున్నాయి.

**ఏడు వేల విలువైన పుస్తక నిధి:** గ్రంథాలయంలో ప్రస్తుతం ఏడు వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో దేశ చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలు, గ్రూప్స్‌తో పాటు ఇతర పోటీ పరీక్షల మేటీరియల్, విద్యార్థుల సిలబస్‌కు సంబంధించిన పుస్తకాలు, నవలలు, పురాణాలు, ఇతిహాసాలు, చిన్న పిల్లల కథల పుస్తకాలు, మాస పత్రికలు, వార పత్రికలు ఇలా ఒక్కటేమిటి మనిషి విజ్ఞానాన్ని పెంచే అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇట్టి ప్రాధాన్యత కలిగిన ఏడు వేల పుస్తకాల నిధి పట్ల పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటం, నిరుద్యోగులు, విద్యార్థులు వివిధ వర్గాల పాఠకులకు శాపంగా మారింది. కాగా గత కొన్నేళ్లుగా గ్రంథాలయ శాఖలో భవన నిర్మాణానికి సంబంధించి నిధులు అందుబాటులో ఉన్నా అధికారులు స్థలం కేటాయించకపోవడంతో భవన నిర్మాణం రూపుదాల్చలేదు.


ర్యాకుల్లో తడిసిపోతున్న పుస్తకాలు

### భవనం కారుతోంది..



భవనం పూర్తిగా కారుతుంది. దీంతో పుస్తకాలు తడిసి పోతున్నాయి. త్వరిత గతిన నూతన భవనం నిర్మిస్తే విలువైన పుస్తకాలు కాపాడుకునే అవకాశం ఉంటుంది.

- రాజామనోహర్ గ్రంథాలయ అధికారి




### సమస్యల వలయంలో గ్రంథాలయం

**కోవెలకుంట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని పాతబస్టాండులో ఉన్న గ్రంథాలయం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. గ్రంథాలయంలో ఫర్నీచర్, కంప్యూటర్, తాగునీరు, తదితర సమస్యలు వేధిస్తున్నాయి. రెగ్యులర్ గ్రంథాలయ అధికారి లేకపోవడంతో మూడురోజులు కోవెలకుంట్ల, మూడు రోజులు సంజామలలో విధులు నిర్వర్తిస్తుండడంతో ఇబ్బందిగా ఉందని పాఠకులు వాపోతున్నారు. ఇక్కడ పనిచేసే అధికారి రెండు చోట్ల విధులు నిర్వర్తిస్తుండడంతో పుస్తకాల కోసం, పేపరు చదవడానికి ఇక్కడకు వచ్చేవారు గ్రంథాలయ అధికారి రూముకు తాళం వేసి ఉండడం, తలుపునకు నోటీసు బోర్డు అంటించడంతో చేసేదేమీలేక వెనుదిరిగి వెళుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయానికి రెగ్యులర్ అధికారిని, సమస్యలు పరిష్కరించాలని పాఠకులు, విద్యార్థులు కోరుతున్నారు.


వర్షానికి తడిసి చెదలు పట్టిన పుస్తకాలు, పేపర్లు



శిథిలావస్థలో ఉన్న కొలిమిగుండ్ల గ్రంథాలయం


కోవెలకుంట్లలో తెరుచుకోని గ్రంథాలయం

## నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

**డోన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** డోన్ మండలంలో రీసర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగమణి సోమవారం తెలిపారు. 22న కామగానిగుంట్ల, 23న కొత్తబురుజు, 24న కొత్తకోట, 25న ఎస్.గుండాల, 26న ఎస్.వలసల గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగమణి విజ్ఞప్తి చేశారు.

**సంజామల:** ఈ నెల 22 నుంచి నవంబరు 2 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ గ్రామ సభల్లో విస్తీర్ణంలో వ్యత్యాసాలు, ముటేషన్, ఖాతాలో తప్పులు, పేర్లలో తప్పులు, భూమి స్వభావంలో తప్పులు మొదలగు తప్పులను సవరించడం జరుగుతుందన్నారు.

**అవుకు :** అవుకు మండలంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సువర్ణదేవి సోమవారం తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

**ఉయ్యాలవాడ :** ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు ఉపయోగించుకోవాలని తహసీల్దారు శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రీసర్వే గ్రామాల్లో భూముల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామసభలకు తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లు హాజరవుతారన్నారు.

## నేడు ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

**డోన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):** డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మంగళవారం నుంచి వినతులు స్వీకరిస్తారని సోమవారం పార్టీ వర్గాలు తెలిపాయి. గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**ఉయ్యాలవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. సమావేశంలో ఆయా గ్రామాల పారిశుధ్య, తాగునీరు, మౌలిక సదుపాయాలపై చర్చిస్తామన్నారు.

## తెరుచుకోని కేసీ కెనాల్ కార్యాలయం

### అధికారుల కోసం వచ్చి వెనుదిరిగిన రైతులు



ఆళ్లగడ్డలో తెరుచుకోని కేసీ కెనాల్ కార్యాలయం

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) :** పట్టణంలోని కేసీ కెనాల్ ఆళ్లగడ్డ సబ్ డివిజన్ కార్యాలయం సోమవారం తెరుచుకోలేదు. మధ్యాహ్నం 12 గంటలైనా కార్యాలయం తెరవకపోవడం.. అధికారులెవ్వరూ రాకపోవడంతో పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు వెనక్కి వెళ్లిపోయారు. సాగునీటి సంఘాలకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండడంతో డిస్ట్రిబ్యూటరీలు, ఓటర్ల జాబితా తదితర వివరాల కోసం ఆశావహులు కార్యాలయానికి వచ్చారు. అడిగేవారెవరూ లేరని.. ప్రభుత్వ కార్యాలయం తెరిచేవారే లేరా..! అంటూ ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయాన్ని కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్ దృష్టికి తీసుకెళ్లగా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులు నంద్యాల కార్యాలయంలో ఉన్నారని సమాధానమిచ్చారు.

## మచ్చల పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

**డోన్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** కంది పంటలో కాయ తులిచే మచ్చల పురుగు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో కంది పంట రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. డోన్ ప్రాంతంలో 75 వేల ఎకరాల్లో కంది పంట సాగులో ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కాయతులిచే మచ్చల పురుగుతో నష్టం కలిగించే అవకాశం ఉందని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో అబ్దుల్ షఫీ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## వంక స్థలం పరిశీలన


వంక స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ, ఏఈ

**చాగలమర్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కొత్తపల్లె గ్రామంలో వంక స్థలం ఆక్రమణ విషయంపై సోమవారం తహసీల్దార్ రవికుమార్, ఎస్ఐ రమేష్‌రెడ్డి, ఆళ్లగడ్డ మైనర్ ఇరిగేషన్ ఏఈ రాంప్రసాద్, సర్వేయర్ మద్దిలేటి పరిశీలించారు. 84, 88 సర్వే నంబర్లకు సంబంధించిన హద్దులను గుర్తించారు. వంక స్థలంలో ఉన్న భూములకు కూడా కొలతలు వేశామని, వాటి సరిహద్దులు గుర్తించామని తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. వంకకు అడ్డుగా వేసిన మట్టిని తొలగించుకోవాలని, రహదారులు, పొలాల్లో ప్రవహిస్తున్న నీరు పోయేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. వంక స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంకను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అంచనా వేసి పనులు చేయుటకు నిధుల కోసం ప్రతిపాదనలు చేస్తామని మైనర్ ఇరిగేషన్ ఏఈ రాంప్రసాద్ తెలిపారు.


## ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారలేదు : ఎస్టీయూ

**బేతంచెర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో ప్రభుత్వం మారినా అధికారుల ధోరణి మారలేదని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్టీయూ బేతంచెర్ల మండల శాఖ ప్రాంతీయ కార్యాలయంలో ఆజాంబేగ్ మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వహించిన సీబీఏనే పేరు మార్చి సెల్ఫ్ అసిస్మెంట్‌గా ఈ కూటమి ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. పరీక్షల్లో 11వ ప్రశ్న నుంచి 15వ ప్రశ్న వరకు వివరణాత్మక ప్రశ్నలు 5 మాత్రమే ఉండి ఒక్కో వ్యాసరూప సమాధాన ప్రశ్నకు 2 మార్కులే ఉండటం వల్ల పిల్లల్లో జవాబు రాసే ఆసక్తి ఉండడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ వెంకటనాయక్, జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ అన్నపరెడ్డి, పుల్లయ్య, సుబ్బారెడ్డి, బాలమద్ది, మల్లేశ్వరుడు, రాజు, ధనుంజయ, శంకర్ నాయక్, నాగరాజు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

**డోన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సోమవారం తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని డోన్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఎంపికైన అభ్యర్థులకు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.

## టీడీపీ కార్యకర్తకు గౌతమ్‌రెడ్డి పరామర్శ


గురుమూర్తిని పరామర్శిస్తున్న గౌతమ్ రెడ్డి

**డోన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గురుమూర్తిని టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి పరామర్శించారు. మండల తెలుగు యువత అధ్యక్షులు కోనేటి కాశీవిశ్వనాథ్ తండ్రి గురుమూర్తి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆసుపత్రికి వెళ్లి గౌతమ్‌రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక

**చాగలమర్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసమే ప్రజా వేదిక ప్రతి సోమవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల వినతులను స్వీకరించారు.

## డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పెంపు

**బనగానపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవడానికి 25వ తేదీ వరకు గడువు పెంచినట్లు నంద్యాల సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రాముడు సోమవారం తెలిపారు. బనగానపల్లెలో ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత బోధన, ఉచిత భోజన వసతివసతి సౌకర్యాలతో మూడు నెలలపాటు అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పొడిగించామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## 1,675 క్వింటాళ్ల శనగ విత్తనాలు పంపిణీ

**బనగానపల్లె , అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** రైతులకు పప్పుశనగ 1,675 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు బనగానపల్లె మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. మండలానికి 1750 క్వింటాళ్లు పప్పుశనగ మంజూరు కాగా ఇప్పటి వరకు 1675 క్వింటాళ్లు విత్తనాలు పంపిణీ చేశామన్నారు. పంపిణీ దాదాపు పూర్తయిందన్నారు. రబీలో బనగానపల్లె మండలంలో కైప, అప్పలాపురం, టంగుటూరు, విఠలాపురం, నందవరం, నందివర్గం, బీరవోలు, రామతీర్థం, యర్రగుడి, హుస్సేనాపురం, మిట్టపల్లె, పలుకూరు, ఇల్లూరుకొత్తపేట, కాపులపల్లె, గులాంనబీపేట, బనగానపల్లె తదితర గ్రామాల్లో 4200 హెక్టార్లలో పప్పుశనగ పంటను వేయడానికి రైతులు సన్నద్ధమైనట్లు తెలిపారు.

## ఘనంగా యాగంటి పల్లకి సేవ

**బనగానపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకి సేవ ఉత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకిలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

## సచివాలయాలను అనుసంధానం చేయాలి

**శిరివెళ్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) :** రాష్ట్రంలోని సచివాలయాలను గ్రామ పంచాయతీలకు అనుసంధానం చేయాలని, ఉద్యోగులను పంచాయతీల ఆధీనంలో ఉంచాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి, మోత్కలపల్లె గ్రామ సర్పంచ్ భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అధిక సచివాలయాలు, అవసరం కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్నందున ప్రతి గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసుల యాదవ్, రాష్ట్ర సహ కార్యదర్శి రామచంద్రుడు యాదవ్, గోస్పాడు సర్పంచ్ బాలన్న పాల్గొన్నారు.

## పోలీసు త్యాగాలు మరువలేనివి


ప్యాపిలిలో అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న పోలీసులు

**డోన్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేవీఎన్ భానుసింగ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణం సందర్భంగా అమరులైన వారిని స్మరించుకుని వారి ఆశయ సాధనకు పాటుపడాలని ఆకాంక్షించారు. అలాగే పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ బృందం అమరులకు నివాళులర్పించింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

**ప్యాపిలి:** స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ మధుసూదన్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు శ్రీనివాసులు, మురళి, పోలీసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ప్రకటించిన ధరలకే విక్రయించాలి

**ఉయ్యాలవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :** ప్రభుత్వం ప్రకటించిన ధరలకే క్రిమిసంహార మందులు, ఎరువులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల లలోని మాయలూరు గ్రామంలో ఉన్న లక్ష్మీవెంకటేశ్వ, లక్ష్మీ నరసింహ, గురు రాఘవేంద్ర ఫర్టిలైజరు ఫెస్టిసైడ్ షాపులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షాపుల్లోని క్రిమిసంహార మందుల శాంపిల్స్ సేకరించామన్నారు. వీటిని ల్యాబ్‌లకు పంపి నాణ్యతను పరిశీలిస్తామన్నారు. నాణ్యత లోపించినట్లు నిర్ధారణ అయితే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈవో ఫణీష్ ఉన్నారు.